


# లంచం

మల్లాది వెంకటకృష్ణమూర్తి

"ఒంట్లో ఎలాగో వుంది." రత్నాకర్‌కి చెప్పింది అతని భార్య.

"హాస్పిటల్‌లో చేర్పిస్తాను అయితే. రోజులు దగ్గిరకి వచ్చేసినట్లున్నాయి?" చెప్పాడు రత్నాకర్.

"నాకెందుకో భయంగా వుంది."

చిన్నగా నవ్వి అన్నాడు రత్నాకర్ భార్య బుగ్గమీద చిటికెవేసి.

"దేనికి భయం? ప్రపంచంలో భార్యలంతా కనటంలేదూ?"

"డాక్టర్ చెప్పిందిగా కవల పిల్లలని..."

"అయితే? కావల్సినవి తీసుకుని అత్తయ్యతో చెప్పి టాక్సీ తీసుకువస్తాను"

రత్నాకర్ పావుగంట తర్వాత టాక్సీతో తిరిగి వచ్చాడు, శ్యామ్‌నగర్‌లోని తన ఇంటికి రత్నాకర్ భార్య ప్లాస్టిక్ బుట్టలో కావల్సిన వస్తువులు సిద్ధం చేసుకుంది. ఫ్లాస్కు భుజానికి తగిలించుకున్నాడు రత్నాకర్. ఓసారి ప్లాస్టిక్‌బుట్టలోని సామాను తనిఖీచేసి చెప్పాడు.

"టూత్‌బ్రష్, పేస్టు, టంగ్‌క్లీనర్ మర్చిపోయావు చూసావా?"

బాత్‌రూంలోంచి వాటిని తెచ్చి, బుట్టలో వేశాడు. రత్నాకర్ అత్తయ్య అన్నది రత్నాకర్‌తో.

"ఒక్క నిముషం ఆగుదాం. ప్రక్కిం

టావిడని ఎదురు రమ్మని కబురు పంపాను."

"ఆవిడ ఎదురువస్తే ఏం ఒరుగు తుంది?" కొద్దిగావిసుక్కున్నాడు రత్నాకర్, అత్తయ్యకి చాదస్తం ఎక్కువని తెలిసికూడా.

"మొదటిసారి కాన్పుకు వెళ్తున్నప్పుడు సలక్షణంగా వెళ్లాలి."

తలుపు తాళంవేసి, టాక్సీలో పావు గంట తర్వాత గవర్నమెంట్ హాస్పిటల్ చేరుకున్నారు ముగ్గురూ. తోడుగా ప్రక్కింటావిడ పద్నాలుగేళ్ల కుర్రాడు కూడా వచ్చాడు. ముగ్గురు వెళ్లడం శుభం కాదని, ఏమయినా కావాలంటే తీసుకు రావడానికి వీలుగా వుంటాడని, రత్నాకర్ అత్తయ్య ఆ కుర్రాడినికూడాపంపమని అడిగింది ప్రక్కింటావిడని.

రత్నాకర్ తన భార్యని మెటర్నిటీ వార్డులో ఎడ్మిట్ చేయించాడు, తనకి తెలిసిన డాక్టర్ద్వారా ఆట్టే ఇబ్బంది పడకుండా

ఓ డాక్టర్వచ్చి పరీక్షచేసి, నొప్పులు రావడానికి మందు ఇచ్చింది

"పురుడు త్వరగా వస్తుందా?" అడిగాడు రత్నాకర్ డాక్టర్ని.

"చెప్పలేం." జవాబు చెప్పింది డాక్టర్.

"నేను ఆఫీసుకు వెళ్ళిపోవాలి. టైం అవుతోంది. నా టెలిఫోన్ నంబర్ మా అత్తయ్య దగ్గర వుంది సిస్టర్కి కూడా ఇచ్చాను ... అవసరం అయితే ఫోన్ చెయ్యండి దయచేసి."

"అలాగే."

రత్నాకర్ హాస్పిటల్ నుంచి ఆటోలో బేంక్స్ట్రీట్లోని తన ఆఫీస్కి వెళ్లాడు వెంటనే.

"మిస్టర్ రత్నాకర్. నీకోసమే ఎదురుచూస్తున్నాం'' అన్నాడు రత్నాకర్ ఆఫీసర్

"నా భార్యని ఆస్పత్రిలో చేర్పించి వస్తున్నాను సార్ అందుకే ఆలస్యమయింది.''

''ఆలస్యం కాలేదు ఆట్టే. ఇవాళ ముఖ్యమయిన పనుంది కదా. డెలివరీ అయిందా మీ భార్యకి?"

''ఇంకా కాలేదు. అవుతే ఫోన్చేసి చెప్తారు."

''గుడ్. నిన్న రిపోర్టు చేసినతను వచ్చాడు. నాతో రండి "

రత్నాకర్ తన ఆఫీసర్ వెంట టెలిఫోన్వున్న ఓ గదిలోకి వెళ్ళాడు. ఇద్దరినీ చూడగానే అంతదాకా కూర్చున్న ఓ మధ్య వయస్కుడు లేచినిలబడ్డాడు

''కూర్చోండి'' అన్నాడు రత్నాకర్ నవ్వుతూ.

ముగ్గురూ కూర్చున్నారు.

''నేను నిన్న వస్తే ఇవాళ రమ్మని చెప్పారు నా బిల్స్ విషయంలో ఆ ఏ.ఇ...''

''గుర్తుంది."చిన్నగా నవ్వి చెప్పాడు రత్నాకర్

"మరి టెలిఫోన్ చేసి ఆ ఏ. ఇ. తో నిన్న మేం చెప్పినట్లుగా మాట్లాడండి. తర్వాత ఏంచేయాలో ఆలోచిద్దాం"

రత్నాకర్ టేబిల్ మీదవున్న టెలిఫోన్‌ని ఆ మధ్యవయస్కుడి వైపు జరిపాడు. వెంటనే టేప్‌రికార్డర్‌ని ఆన్ చేసాడు. ఆ మధ్యవయస్కుడు రిసీవర్ అందుకొన్నాడు

ముందర ఏడు నంబర్ డయల్ చేసి, తర్వాత నాలుగు నంబర్లు డయల్ చేసాడు వరసగా.

రత్నాకర్, రత్నాకర్ ఆఫీసర్ రిసీవర్ చెవిదగ్గర వుంచుకున్న ఆ మధ్య వయస్కుడివంక నిశ్శబ్దంగా చూడసాగారు, సర్కస్‌లోని కష్టమయిన ప్రదర్శన చూసేటట్లుగా.

కొన్ని క్షణాల మౌనం తర్వాత అవతలనుంచి వినిపించింది.

"హలో!"

"నమస్కారం సార్. ఏ.ఇ. గారేనా నేను నిన్న ఉదయం తమరి దర్శనం చేసుకున్నాను సార్ నిజామాబాద్‌లో ఆ మూడు లక్షల బిల్ సంగతి..."

"నమస్తే చెప్పండి." హుందాగా చెప్పాడు టెలిఫోన్‌కి అవతలివైపు వ్యక్తి.

"వీలయినంత తొందరగా వాటిని పాస్‌చేస్తే మేలు చేసినవాళ్ళవుతారు"

"చూస్తాను. సెక్షన్‌లో అడిగి చూడండి"

"నిజామాబాద్‌నుంచి వచ్చాను సార్. తమరి స్టెనోతో చెప్పాను నిన్న. మీకు చెప్పే వుంటారనుకుంటాను."

"ఏమని?"

"అదే..." నీళ్ళు నములుతున్నట్లుగా, కొద్దిగా తడబాటుగా చెప్పాడు అతను ఏ.ఇ తో.

"అదే సార్ మీ అబ్బాయి కొత్తగా కాలేజీలో చేరాడని. మీ అబ్బాయికి స్కూటర్ కొనిద్దామను కుంటున్నారని తెలిసింది."

చిన్నగా నవ్వు వినిపించింది.

"అయితే?" వుత్సాహంగా అడిగాడు.

"అదే సార్. స్కూటర్‌కోసం చాలా సంవత్సరాల క్రితం నేను రిజిష్ట్రేషన్ చేయించాను. ఇప్పుడది నా కవసరం లేదు. వారం క్రితం డెలివరీ తీసుకున్నాను. స్టెనో చెప్పలేదా మీకు?"

"చెప్పాడు. ముందే ఆరాలన్నీ తెలుసుకుని వచ్చినట్లున్నారే?"

"అహ. అబ్బే. మాటల్లో తెలిసిందంతే"

"మీ బిల్స్ గురించిన వివరాలు?"

"అక్కడికి వస్తాను సార్. నా దగ్గరున్నాయి."

"మధ్యాహ్నం మూడున్నరకి రండి."

"అలాగే సార్...అన్నట్లు ఇవాళ త్రీ ఏసెస్ లో రెండు సీట్లు రిజర్వు చేయిస్తాను సార్. శనివారం రాత్రికదా. ఫ్లోర్ డేన్సులు..."

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత నబడింది.

"అయిదు రిజర్వ్ చేయించండి."

"మీ స్నేహితులెవరన్నా...?"

"అవును. మీతో కూడా కలిపి అయిదు ట్లు. మూడున్నర కొస్తున్నారుగా?"

"అయ్యో! తప్పకుండా."

అవతలనుంచి క్లిక్ మన్న చప్పుడు వినిపించింది. రిసీవర్ పెట్టేసాడు ఆ మధ్యవయస్కుడు.

రత్నాకర్ తిరుగుతున్న టేప్ వంక చూసి విజయగర్వంగా నవ్వుకున్నాడు. టేప్ రికార్డర్ సెట్ కున్న 'స్టాప్' బటన్ నొక్కాడు. రికార్డర్ లో స్పూల్ తిరగడం ఆగిపోయింది.

"చాలుకదా సార్?" అడిగాడు రత్నాకర్ తన ఆఫీసర్ ని.

"ఎక్సలెంట్" అన్నాడు రత్నాకర్ ఆఫీసర్. రత్నాకర్ 'రీ వైండ్' అని వ్రాసివున్న బటన్ నొక్కి, ఎడ్జస్టు చేసాడు టేప్ ని కాస్సేపు తంటాలుపడి. తర్వాత 'ప్లే' నొక్కాడు.

టెలిఫోన్ డయల్ చేసిన చప్పుడుతో సహా, ఇద్దరి సంభాషణ రిసీవర్ పెట్టేసే దాకా చక్కగా రికార్డ్ అయింది టేప్ మీద.

''దొరికాడు" అన్నాడు రత్నాకర్ సెట్ మీద మునివేళ్ళతో చిన్నగా మీటుతూ.

"ఆయన మరీ ఇబ్బంది పెట్టేస్తు న్నాడు సార్. పవర్ చేతిలో వుందని డబ్బిస్తేకాని పని జరగనివ్వడు. వారంలో నాలుగు రోజులు ఇక్కడ వుంటేకాని చెక్స్ రావటంలేదు."

"మాకు ఆయనమీద చాలా కంప్లైయింట్స్ వచ్చాయి" అన్నాడు రత్నాకర్ సాలోచనగా.

మధ్యాహ్నం మూడున్నరకి ఆయన ఆట కట్టించాలనుకున్నాడు మనసులోనే.

"హాస్పిటల్ కి వెళ్ళొస్తారా ఓసారి?" అడిగాడు రత్నాకర్ ని అతని ఆఫీసర్ గంట తర్వాత.


"అక్కరలేదు సార్. కానుపు అవ గానే ఫోన్ చేయమని చెప్పాను. కవల పిల్లలో, మొగో, ఆడో తెలిసిపోతుంది. తెలిసేదాకానే ఈ తాపత్రయం.

"నిన్న సాయంత్రం మీరెళ్ళాక ఆ ఫారెస్టు ఆఫీసరు వచ్చాడు." అన్నాడు నవ్వి.

రత్నాకర్ కూడా నవ్వి అన్నాడు.

"డిస్మిస్ అవుతాడు తప్పకుండా. లేకపోతే లంచం తీసుకుని దొంగ చాటుగా అడవుల్లోని సంపదని ప్రయి వేట్ వ్యాపారస్థులకి అమ్ముతాడా?"

"పదివేలదాకా ఇస్తానని బతిమాలడం మొదలుపెట్టాడు. బయటికి గెంటించి నంత పనిచేసాను లంచగొండులని పట్టుకునే మనకే లంచం?"



రత్నాకర్ నవ్వాడు.

"ఆ రేషన్‌కార్డ్స్ గొడవ ఫైల్ చూడండి. వచ్చేవారంలో షెడ్యూల్ చేయండి అది."

"అలాగే సార్."

*     *     *

"హలో. రండి" అన్నాడు ఏ. ఇ. ఆ మధ్యవయస్కుడు లోపలకు రాగానే.

ఏ.ఇ. అందించిన చేతిని అందుకుని, కరచాలనంచేసి చెప్పాడు అతను.

"గంట ఆలస్యంగా వచ్చాను మరి చెప్పిన టైంకన్నా. మధ్యలో టాక్సీ చెడి పోయింది."

"ఇంక మీరు రారేమోనని భయ పడుతున్నాను, తీరా స్నేహితులకి చెప్పే సాక. రిజర్వేషన్ దొరికిందా?"

"దొరికింది."

"గుడ్. స్కూటర్ సంగతి ఏదో అన్నారు?" రిజిస్ట్రేషన్ కొంతకాలందాకా మావాడి పేర మార్చేందుకై రూల్స్ వప్పుకోవుగా?"

"దానికి నేనేదో ఏర్పాటు చేస్తాను సార్."

"కాఫీ తీసుకుంటారా?"

"అట్లాగే బయటికి వెళ్ళి తాగుదాం. నా బిల్స్ వివరాలు రాసిన కాగితాలివి. మీ భాషలో చెప్పాలంటే లాంగ్ అవుట్ స్టాండింగ్."

''మా భాష నేర్చుకున్నారే" అన్నాడు ఏ.ఇ. గట్టిగా నవ్వుతూ. ఆ కాగితాలు అందుకుని అక్కడక్కడ చదివి, టేబిల్‌కున్న డ్రాయర్‌లో జాగ్రత్తగా వాటిని దాచాడు.

''బయటికి వెళ్దామా?" అడిగాడు

''మీరు కూర్చోవాలా ఆఫీస్‌లో అయిదయేదాకా?"

"అవసరంలేదు. ఇవాళ మధ్యాహ్నం శెలవే. పదండి వెళ్దాం."

ఆ మధ్యవయస్కుడు జేబులోంచి ఓ తెల్లకవరుతీసి ఏ. ఇ కి అందించి అన్నాడు.

''ఇది వుంచండి ప్రస్తుతానికి."

ఆయన కవరు తెరచి లోపల ఎంత వుందో చూడనయినా చూడకుండాదాన్ని తన ప్యాంటు జేబులో వుంచుకున్నాడు టేబిల్‌మీద వున్న పేపర్ వెయిట్స్, కాలింగ్‌బెల్, పెన్‌స్టాండ్, కాగితాలు డ్రాయర్‌లోపెట్టి డ్రాయర్‌కి తాళంవేసి చెప్పాడునవ్వుతూ.

''చిన్న పెన్సిల్ ముక్క మర్చిపోయినా చాలు, దానికి కాళ్ళొచ్చేస్తాయి ఈ ఆఫీస్‌లో."

ఇద్దరూ బయటకి నడిచారు.

"మరో వారంరోజుల్లో చెక్ ఇప్పించగలరా సార్?" అడిగాడు ఏ ఇ ని అతను.

''ప్రయత్నిస్తాను. చాలా పాతవి. చూడాలి."

ఆఫీస్ బయటికి వచ్చారు ఇద్దరూ. ఆయన ఒకసారి తాళంచెవి గుర్తికోసం కోటు జేబులో చెయ్యిపెట్టుకుంటూండగా రత్నాకర్ దగ్గరికివచ్చి అన్నాడు.

"ఏంటీ కరప్షన్ బ్యూరోనుంచి వస్తున్నాను. మిమ్మల్ని సెర్చ్ చెయ్యాలి "

క్షణంలో ఏ.ఇ. మొహం పాలిపోయింది. నిశ్చేష్టుడై నిల్చుండిపోయాడు కొన్ని క్షణాలు. మొహంలోకి భయం పాకింది చరచరా.

''నా పేరు రత్నాకర్."

రత్నాకర్ తను రెయిడ్‌చేసేటప్పుడు తీసుకువచ్చే ఐడెంటిటీ కార్డ్ చూపించాడు ఏ ఇ కి

"దేనికి?'' అడిగాడు ఏ. ఇ తేరుకుంటూ.

"చెప్తాను "

రత్నాకర్, రత్నాకర్ ఆఫీసర్ కాక ఏంటీకరప్షన్ బ్యూరో స్పెషల్‌స్క్వాడ్‌కి చెందిన మరో ముగ్గురు ఆయన్ని సోదా చేసారు.

రత్నాకర్ ఆఫీసర్ ఆయన జేబులోని తెల్లకవరు విప్పి, అందులోంచి పది వందకాగితాలు బయటికి తీసాడు. ఆ పాత వందరూపాయల నోట్లవంక చూసి అన్నాడు.

"ఎక్కడిది ఈ డబ్బు?"

''నా...నాదే"

''ఎక్కడిది?''

"ఇంటినుంచి తెచ్చాను "

"దేనికి?"

"పూరికే. మీకన్నీ చెప్పాలా?"

"ఇతను ఇచ్చాడు మీకు "

"అబద్ధం ఎందుకు ఇస్తాడు?"

"ఇవి ఇతనిచ్చినవే నేనే స్వయంగా ఈ నోట్లమీద మూలగా నా సొంత వ్రాలు చేసాను గుర్తుకి వీటిమీద ఆ వ్రాల్లు అలాగేవున్నాయి. నంబర్లు కూడా ఒకటే." అని ఆగి అన్నాడు నెమ్మదిగా.

"మీమీద లంచం పుచ్చుకున్న నేరం చూపుతున్నాం "

* * *

రత్నాకర్ రెయిడ్ తర్వాత ఆఫీస్‌కి తిరిగి వెళ్ళడానికి అయిదున్నరయింది సాయంత్రం. డాక్టర్ అప్పటికే రెండు సార్లు ఫోన్ చేసింది హాస్పిటల్‌నుంచి ఆలా అని రత్నాకర్ టేబిల్‌మీద కాగితంమీద వ్రాసివుంచాడో తోటి వుద్యోగి రత్నాకర్‌కి కనబడేలా ఆ కాగితాన్ని టేబిల్‌మీద పెట్టారు ఎదురుగా

రత్నాకర్ హాస్పిటల్‌కి ఫోన్ చేసాడు. నర్స్‌వచ్చి మాట్లాడింది.

"రత్నాకర్‌గారా? డాక్టర్ మీకోసం రెండుసార్లు ప్రయత్నం చేసింది. వెంటనే రాగలరా?"

"ఆడా, మొగా?" అడిగాడు.

"ఆడపిల్లలు ఇద్దరూ."

"కవలపిల్లలా?"

"అవును. ఐయామ్ సారీ మిస్టర్ రత్నాకర్ స్టిల్ బార్న్‌బేబీస్ "

"అంటే?"

"చచ్చిపోయి పుట్టారు ప్రాణంతో కాదు."

"అబ్బా" అన్నాడు రత్నాకర్ కొద్దిగా బాధగా.

"మరి వస్తున్నారా?" అడిగింది నర్స్

"బయల్దేరుతున్నాను నా భార్య ఎలావుంది?"

"మీరు రండి చూద్దురుగాని."

"స్పృహలోనే వుందా?"

"ఐయామ్ సో సారీ. మీ భార్య మరణించింది పురుడు కష్టమయి."

రత్నాకర్ భుజంమీద చెయ్యివేసి అడిగాడు, రత్నాకర్ ఆఫీసర్.

"ఎలావున్నారు?"

రత్నాకర్ మౌనంగా రిసివర్‌ని రెస్ట్ మీద వుంచాడు

"పదండి నేనూ వస్తాను ఆస్పత్రికి" అన్నాడు. ఇద్దరూ మోటర్‌సైకిల్‌మీద బయల్దేరారు. దారిపొడుగూతా రత్నాకర్ ఆఫీసర్ మాట్లాడుతూనే వున్నాడు ఆఫీస్ విషయాలగురించి, లంచం తీసుకునేవాళ్ళ గురించి

"లంచం తీసుకోవడం, ఇవ్వడం పెద్ద జాడ్యం అయిపోయింది గవర్నమెంట్ ఆఫీసుల్లో. ఏంటీకరప్షన్‌బ్యూరో ఒక్కటి చాలదు. మనుషుల్లో మార్పు

ముఖ్యం. లంచం తీసుకోవడం ఓ బల హీనత. లంచం తీసుకోవడం ఓ అంటు రోగం. లంచం తీసుకోవడం ఆత్మాశ వల్లే. లంచం తీసుకోవడం అంటే అవకాశాన్ని సృష్టించుకుని, ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేయడమే. లంచం తీసుకోవడం అంటే ఆత్మాభిమానాన్ని చంపుకోవటమే. లంచం తీసుకోవడం అంటే న్యాయానికి, రూల్స్‌కి వ్యతిరేకంగా పనిచేయటమే. పెద్దవాళ్ళ దగ్గరనుంచి చిన్నవాళ్ళదాకా, మంత్రులదగ్గరనుంచి గేట్‌కీపర్లదాకా, అందరికీ లంచం సాధారణం, జీవితంలో ఓ భాగం అయిపోయింది. ఇవ్వబట్టే పుచ్చుకుంటున్నారు పుచ్చుకోబట్టే, అడగబట్టే ఇస్తున్నారు. కాయముందా, విత్తుముందా లాగ వుందీ వ్యవహారం...''

రత్నాకర్ లెక్కలేనన్నిసార్లు ఈ తరహా సంభాషణ విన్నాడు ఆఫీసర్ నుంచి. అందుకే వినటంలేదు. గుండెలో బండరాయి వుంచినట్లుగా వుంది రత్నాకర్‌కి. గొంతులో ఏదో అడ్డుపెట్టినట్లుగా వుంది. ఏడుపురావటంలేదు. కాని ఇక ఎక్కువసేపు తను ఏడవకుండా కంట్రోల్ చేసుకోవటం కష్టం అని తెలుసు రత్నాకర్‌కి.

హాస్పిటల్ కాంపౌండ్‌లో మోటార్ సైకిల్ ఆపాడు రత్నాకర్ ఆఫీసర్. మోటార్‌సైకిల్‌కి తాళంవేసి అడిగాడు రత్నాకర్‌ని.

"మొగా, ఆడా? అడగటంమర్చాను. చెప్పనేలేదే మరి?''

''ఆడపిల్లలు" రత్నాకర్ కంఠం వణికింది.

"పదండి "

ఇద్దరూ తలుపువైపు నడిచారు.

''ఎక్కడికి?'' అడిగాడు వాచ్‌మన్ ఇద్దరినీ.

''మెటర్నిటీ వార్డ్‌లోకి" చెప్పాడు రత్నాకర్.

''పాస్ వుందా?" ఎగాదిగా చూసి అడిగాడు వాచ్‌మన్ విసుగ్గా.

''లేదు. ఉదయం ఎడ్మిట్ చేయించాను. పాస్ రేపు ఇస్తానంది డాక్టర్."

"సాయంత్రం నాలుగు, ఆరు మధ్య మాత్రమే విజిటర్స్ వెళ్ళవచ్చు. పాస్ లేకుండా ఇప్పుడు వెళ్ళకూడదు. ఆరు దాటింది ఇప్పుడు "

"లోపల వున్నది నా భార్యే. నర్స్ ఫోన్‌చేసి రమ్మని చెప్పింది."


"అందర్ నై జాసక్తే."

''నేను అర్జెంట్‌గా వెళ్లాలి. నాభార్యా, పుట్టిన పిల్లలూ చచ్చిపోయారు."

తను ఆఫీసర్‌కి చెప్పకుండా దాచిన ఆ రహస్యంతోపాటు దుఃఖం కూడా బయటపడింది రత్నాకర్‌కి. రత్నాకర్ ఆఫీసర్ అదిరిపడి అడిగాడు.

"చచ్చిపోయారా?"

''నై సాబ్. లోపలికి వెళ్ళకూడదు



పాస్‌లేకుండా." వాచ్‌మన్ స్థిరంగా చెప్పాడు మళ్ళీ.

''ఎందుకు వెళ్ళకూడదు?'' పెద్దగా అరుస్తూ అడిగాడు రత్నాకర్ ఆఫీసర్.

"రూల్స్ లేవు లోపలకి పాస్ లేకుండా ఎవరినీ పంపించటానికి. కావాలంటే రిపోర్ట్ చేసికోండి నామీద" ఇంకా స్థిరంగా చెప్పాడు

''పాస్ ఎక్కడ ఇస్తారు?''

''డాక్టర్ రాసివ్వాలి. డాక్టర్ లేదు. వెళ్ళిపోయింది. రేపు ఉదయం రండి "

"రేపటిదాకా చూడకుండా వుండలేను శవాలనయినా సరే." రత్నాకర్ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

"లోపలకు వెళ్ళకూడదు. రూల్స్ లేవు."

ఏంచేయాలా అని బిత్తరపోతూ చూస్తున్నాడు రత్నాకర్ ఆఫీసర్. రత్నాకర్ కొద్దిగా కదిలాడు. జేబులో చెయ్యిపెట్టాడు. పర్స్ బయటకు తీసాడు. తెరిచాడు. లోపలినుంచి రూపాయికాగితం తీసాడు. వాచ్‌మన్ చేతిలో పెట్టాడురూపాయని—లంచాన్ని.

"నేను పంపానని చెప్పకండి. చూసి తొందరగా వచ్చేయండి" అన్నాడు వాచ్‌మన్ గేటుతలుపు కొద్దిగా తెరిచి, ఆ రూపాయిని హుషారుగా జేబులో పెట్టుకుంటూ.